మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

పాల్గొన్న అధికారులు

మాట్లాడుతున్న పీవో ఖుష్బు గుప్తా

ఉట్నూర్, జూన్ 24 : ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. సోమవారం స్థానిక పీవో క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమశాఖ అధికారులు, ఏటీడీవోల, ఏసీఎంవోలు, జీసీడీవోల, క్రీడాధికారులు, పీఎంఆర్సీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. పనులలో నాణ్యత తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆశ్రమాలకు వచ్చే సరుకులు కూడ నాణ్యతగా ఉండాలని సూచించారు. అధికారులు ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తన దృష్టికి తీసుకరావాలని కోరారు. జీసీడీవోలు తప్పనిసరిగా వారంలో ఒకరోజైన రాత్రులు సందర్శించి అక్కడే నిద్రించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈలు దిలీప్ కుమార్, గంగారాం, జీసీడీవోలు రామానందం, అదనపు డీఎంహెచ్ఓ మనోహర్, ఏసీఎంవోలు జగన్, ఉద్దవ్, రాజమౌళి, శివాజీ, క్రీడాధికారి పార్థసారది, మీనారెడ్డి, జీసీడీవోల చాయ, శకుంతలలు పాల్గొన్నారు.

వన్యప్రాణి వేటగాడి అరెస్ట్

కేసు నమోదు చేసిన ఫారెస్ట్ రేంజ్ అధికారి

భుజంగ్‌ను అరెస్టు చేసిన అటవీశాఖ అధికారులు

ఇన్‌స్టాగ్రామ్‌లో ఉడుముతో భుజంగ్

కుభీర్, జూన్, 24: మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన భుజంగ్ వన్యప్రాణులను వేటాడుతూ ఫారెస్ట్ అధికారులకు చిక్కిన సంఘటన జిల్లాలో కలకలం రేపింది. భైంసా ఫారెస్ట్ రేంజ్ అధికారి రాథోడ్ రమేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఆదివారం భుజంగ్ వేటాడి వెంట తీసుకవచ్చిన ఉడుముతో మాలేగాం గ్రామంలోని చౌరస్తాలో గల ఓ హోటల్‌లో ఉడుమును పట్టుకొని చాయ్ తాగుతున్న వీడియో ను హోటల్ యజమాని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. దీంతో ఈ వీడియో వైరల్‌గా మారడంతో అటవీ శాఖ అధికారులు సోమవారం గ్రామానికి వెళ్లి హోటల్ యజమాని శివాను విచారించి భుజంగ్ ఇంట్లో తనిఖీలు జరపగా వండిన ఉడుము కూర దొరికింది. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఇటువంటి వన్యప్రాణులకు హాని కలిగించినా, చంపినా కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో తెలిపారు. ఇందులో డీఆర్‌వో ఇర్ఫానోద్దిన్, బీట్ ఆఫీసర్‌లు లేనిన్, హరిలత ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ముథోల్ ఎమ్మెల్యే

కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల, జూన్, 24 : భైంసా మండలంలోని గుండేగాం, సిరాల గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలని సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను నిర్మల్‌లోని ఆమె కార్యాలయంలో కలిసి వివరించినట్లు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. గుండేగాం గ్రామంలో 162 కుటుంబాలు ఉండగా, భారీ వర్షాలు కురిసినప్పుడు పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాల్లో నీరు నిలుస్తుందని, వారికి చెందిన 364 ఎకరాల పంట భూములు ప్రతియేటా నీట మునుగుతున్నాయని, వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా బతుకుతున్న ఈ గ్రామాల కష్టాలను తీర్చే పరిష్కార మార్గాలను అన్వేషించాలని, అలాగే సిరాల ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 12.36 కోట్లు మంజూరు అయ్యాయని పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీపీ అప్క గజ్జారాం, ఎంపీటీసీలు మధుకర్, కట్ట రవి, నాయకులు సాంప్లే రమేష్, జీవీ రమణ రావు, వెంగల్‌రావు, గౌస్, పసుల నవీన్, మాజీ సర్పంచ్ చెన్న మహేష్, కుంటాల, భైంసా మండల నాయకులు ఉన్నారు.

ఇబ్బందులు కలగకుండా చూడాలి

మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజాని

వంటశాల గదులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ జాహీర్‌రంజానీ

ఎదులాపురం, జూన్ 24 : విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కనీస మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అన్నారు. సోమవారం రూరల్ మండలంలోని చాందా (టి) వద్ద గల మైనార్టీ బాలుర గురుకులన్ని ఆయన తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, వసతులు, వంటశాల గదులను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిర్వహన సర్గిగా లేకపోవడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలం నేపథ్యంలో పరిసరలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాసిరకమైన భోజనం పెడితే సహించేదిలేదన్నారు. విదుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామన్నారు.

షీటీం అవగాహన

సోన్, జూన్ 24 : నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలోని జడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో విద్యార్థులు తమకు తాము ఎలా రక్షించుకోవాలో వారికి వివరించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు గజ్జారాం, ఉపాధ్యాయులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

తాంసి(భీంపూర్), జూన్ 24 : భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి చెక్‌పోస్టు వద్ద సోమవారం బెస్ట్ ఫ్రెండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అజిజ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఆపదలో రక్తం అవసరమైతే బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీని సంప్రదించినట్లయితే రక్తం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రవీందర్, విక్రమ్, శంకర్, ఆసిఫ్ అలీ, బ్లడ్ బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

30.4 మి.మీటర్ల వర్షపాతం

నిర్మల్ అర్బన్, జూన్ 24 : నిర్మల్ జిల్లాలో గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 30.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నిర్మల్ రూరల్‌లో 79.4, నిర్మల్ టౌన్‌లో 73.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కుబీర్‌లో 10.4, తానూర్‌లో 30.2, బాసర 59.0, ముధోల్ 3.4, భైంసా 32.2, కుంటాల 10.4, నర్సాపూర్ జి, 10.6, లోకేశ్వరం 13.2, దిలావర్‌పూర్ 66.4, సారంగపూర్ 12.6, సోన్ 73.6, లక్ష్మణ్ చాంద 46.6, మామడ 12.0, పెంబి 16.4, ఖానాపూర్ 24.8, కడెం 13.4, దస్తూరా బాద్ 4.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ అర్బన్, జూన్ 24 : నిర్మల్ జిల్లాలోని ఆయా మండలాల అర్హులైన పేద ప్రజలకు అందించే డబుల్ బెడ్రూం ఇండ్లకోసం దరఖాస్తులను స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను సోమవారం అధికారులు ఏర్పాటు చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లకు గతంలో దరఖాస్తు చేసుకోని వారి సౌకర్యార్థం దరఖాస్తులను సమర్పించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసులు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 24 : పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేయాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదు దారులు ఫిర్యాదులు చేయగా ఓపికగా ఆమె సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.

గంజాయి రవాణా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 24 : జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని జిలా ఎస్పీ డా. జానకి షర్మిల అన్నారు. ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్నేషనల్ డే మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన కరపత్రాలను ఎస్పీ ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి సరఫరా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అడ్డుకోవాలని అన్నారు. గంజాయి మత్తుకు అలవాటైన యువత, కార్మికులు తమ స్నేహితులతో కలిసి పట్టణ శివారు ప్రాంతాలలో గంజాయి వాడుతున్నారన్నారు. వారిపై నిఘూ పెంచి గంజాయి వాడకానికి అడ్డుకట్ట వేయాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడ డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, నవీన్‌కుమార్ ఉన్నారు.

ఒకరికి గాయాలు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 24 : నిర్మల్ పట్టణంలోని ఈద్గామ్ చౌరస్తాలో ఆది వారం రాత్రి ఆటోను కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటో నడుపు తున్న ప్రశాంత్ రెండు కాళ్లకు తీవ్రగా యాలయ్యాయి. ఆటో పూర్తిగా దెబ్బ తింది. గాయ పడ్డ ప్రశాంత్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తర లించారు. ప్రశాంత్ తల్లి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అశోక్ తెలిపారు.

ఎస్ఐకి సన్మానం

తాంసి, జూన్ 24 : మండల ఎస్ఐ శివరాంను వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శితో కలిసి సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించి ప్రజలతో సత్సంబంధాలు ఏర్పర్చుకొని శాంతి భద్రతలు కాపాడడంతోపాటు ఎన్నికలు సజావుగా నిర్వహించిన నేపథ్యంలో జిల్లాస్థాయిలో ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైనా సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అండె అశోక్, బీఆర్ఎస్ నాయులు మలపతి సుభాష్, విఠల్ పాల్గొన్నారు.

ఘనంగా హ్యాండ్ బాల్ దినోత్సవం

ఎదులాపురం, జూన్ 24 : ఘనంగా హ్యాండ్ బాల్ అంతర్జాతీయ దినోత్సవాన్ని జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఓక్లే ఇంటర్నెషనల్ పాఠశాలో ఘనంగా జరుపుకున్నారు.కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కన్వినర్ పార్థసారథి, జిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిచరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డెన్నికౌర్ ,క్రీడాకారులు జాషువా , పృథ్వీ, చంద్రకాంత్ సిందు, గంగోత్రి, రాధా , శృతి ,వైష్ణవి తదితరులు ఉన్నారు.

క్రీడా ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఎదులాపురం, జూన్ 24 : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం పట్టణం, ఆదిలాబాద్ రూరల్ మండాల నాల్గోతరగతి విద్యార్థులకు క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. వీరికి జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి ,బ్యాడ్మింటన్ ,బాక్సింగ్ శిక్షకులు కబీర్‌దాస్, సాయికుమార్, ఆయా క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ నెల 27,28తేదీల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలి

బోథ్, జూన్ 24 : సోనాల జడ్పీఎస్ఎస్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం వీడీసీ కార్యవర్గ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా రేడ్ రిబ్బన్

బోథ్, జూన్ 24 : సోనాల నుంచి గుర్రాత తాండకు వెళ్లే బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. సోమవారం సోనాలకు చెందిన రంజిత్, రాజు, ప్రణీత్ ముందు జాగ్రత్తగా ప్రమాదాలు సంభవించకుండా కోతకు గురైన చోట రేడ్ రిబ్బన్ కట్టి హెచ్చరిక ఏర్పాటు చేశారు. రోడ్డు, భవనాల శాఖాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 24 : నిర్మల్ జి ల్లా ప్రైవేటు డిగ్రీ కళశాలలో గత మూడేళ్లుగా ఇవ్వవలసిన ఫీజు రీయిం బర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమానులు సోమవారం నిర్మల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇక్కడ ప్రైవేటు కళాశాలల యజమానులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ విధానాలే..

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీ
- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలను యథావిధిగా కొనసాగిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'ఎంఎస్ఎంఈ-సమ్మిళిత అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...'ప్రభుత్వాలు వస్తుంటాయ్.. పోతుంటాయ్, కానీ అభివృద్ధి ఆగకూడదు.. పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా గత సర్కారు ప్రవేశపెట్టిన వివిధ పాలసీలను కొనసాగిస్తాం'అని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ ఎంఈ పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు, దీంతో దేశంలోనే మొదటి ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలువనున్నదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ రూపకల్పన జరుగుతున్నదని, దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వాలని పరిశ్రమ వర్గాలను కోరారు. పరిశ్రమకు నైపుణ్యంగల ఉద్యోగుల అవసరం ఎంతో ఉందని, ఇందుకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మూడు నెలల్లో నైనీలో బొగ్గు ఉత్పత్తి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం వెల్లడి

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ నుంచి ఈ సెప్టెంబర్ చివరికల్లా బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. నైనీకి 50 కిలోమీటర్ల దూరంలోనే 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కూడా సంస్థ నిర్మించనున్నది. ఈ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలంతోపాటు కీలకమైన భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం సోమవారం ఒడిశాలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్‌జెనాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైనీ కోల్‌బ్లాక్‌కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయని, రెండో దశ అటవీ అనుమతుల కోసం నిబంధనలను పాటిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రూ.180 కోట్లు చెల్లించామని, వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికలో భాగంగా మరో రూ. 39 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం కోసం 783 హెక్టార్ల అటవీభూమిని తమకు బదలాయించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తికి అన్ని రకాలుగా సహకరిస్తామని ఒడిశా సీఎస్ హామీనిచ్చారు.

4,800 కోట్ల నుంచి సున్నాకు

బైజూస్‌లో పెట్టుబడులను రైటాఫ్ చేసిన ప్రోసస్



న్యూఢిల్లీ, జూన్ 24: డచ్‌కి చెందిన పెట్టుబడుల సంస్థ ప్రోసస్ నిండాము నిగింది. బైజూస్‌లో పెట్టిన 578 మిలియన్ డాలర్ల(రూ.4,800 కోట్ల) పెట్టుబడులను రైటాఫ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఎడ్యుటెక్ సంస్థ బైజూస్‌లో గతంలో 9.6 శాతం వాటా కలిగివున్నది. ప్రస్తుతం ఈ వాటాను సాంకేతికంగా రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. దీంతో సంస్థకు రూ.4,800 కోట్ల భారీ నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని నెదర్లాండ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. బైజూస్‌లో ఈక్విటీ ఇన్వెస్టర్ల వాటాల విలువ భారీగా క్షీణించిన నేపథ్యంలో రైటాఫ్ నిర్ణయం తీసుకున్నామని ప్రోసస్ వెల్లడించింది. దీంతో 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 493 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రైట్స్ ఇష్యూకి ముందు బైజూస్‌లో 9.6 శాతం వాటా ఉందని పేర్కొంది. కంపెనీ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్తు అంచనాలకు తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో బైజూస్ కంపెనీ విలువను సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

వాణిజ్య

కిర్రాక్ ఐపీవో షో

జనవరి మొదలు పబ్లిక్ ఇష్యూకు 37 సంస్థలు • 32,000 కోట్ల సమీకరణ • 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ రికార్డు

ముంబై, జూన్ 24: ఈ ఏడాది సెకండరీ మార్కెటే కాదు.. ప్రైమరీ మార్కెట్ కూడా దుమ్మురేపింది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీలు సరికొత్త స్థాయిల్లో కదలాడుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లలోకి రికార్డు స్థాయిలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) వచ్చేస్తున్నాయి. ఎంతలా అంటే గడిచిన 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ ప్రథమార్ధం (జనవరి-జూన్)గా నిలిచింది. ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా 37 సంస్థలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. ఇందులో కో-వర్కింగ్ స్పేస్, ఫర్నీచర్ రిటైలింగ్, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వంటి కంపెనీలూ ఉండటం విశేషం. ఇవన్నీ కలిసి దాదాపు రూ.32,000 కోట్ల నిధులను సమీకరించడం గమనార్హం. ఈ వారంలోనే మూడు ఐపీవోలు ముగిశాయి.

2007 తర్వాత..

2007 ప్రథమార్ధంలో గరిష్ఠంగా 54 సంస్థలు దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఐపీవోల ద్వారా ప్రవేశించాయి. నాడు అవి సమీకరించిన నిధులు రూ.20,833 కోట్లు. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయిలో కంపెనీలు ఈక్విటీ మార్కెట్లలోకి వచ్చాయి. అయితే 2022 జనవరి-జూన్‌లో 16 సంస్థలే వచ్చినా రూ.40,311 కోట్ల నిధుల సమీకరణ జరిగింది. ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఐపీవో కలిసొచ్చింది. ఈ ఒక్క పబ్లిక్ ఇష్యూ విలువే రూ.21,000 కోట్లు. ఇది గనుక లేకపోతే ఐపీవో మార్కెట్‌లో 6 నెలల్లో సమీకరించిన నిధులపరంగా ఈ ఏడాదే అత్యుత్తమం. ఇక గత ఏడాది ప్రథమార్ధంతో పోల్చితే ఈ ఏడాది ఫండింగ్ నాలుగు రెట్లు ఎగిసింది. దేశ, విదేశీ మదుపరుల మద్దతే ఇందుకు కారణం. స్టాక్ మార్కెట్ల రికార్డు లాభాలూ కారణమే. ఈ లాభాలకు ఆకర్షితులయ్యే మరిన్ని సంస్థలు ఐపీవోలకు సిద్ధమైనట్టు మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. పైగా గతంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన ఏ ఏడాది ప్రథమార్ధంలోనూ ఈసారి నమోదైన దాంట్లో నాల్గో వంతు కూడా పబ్లిక్ ఇష్యూలు, నిధుల సమీకరణ జరుగలేదు.

క్యూలో మరికొన్ని..

హ్యుందాయ్ ఇండియా, స్విగ్గీ, ఓలా తదితర ప్రముఖ సంస్థలన్నీ ఐపీవోలకు క్యూ కట్టాయి. ఇందులో హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూ దేశ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్దది కానుండటం గమనార్హం. ప్రస్తుతం ఎల్ ఐసీ పేరిట ఉన్న భారీ ఐపీవో రికార్డూ చెరిగిపోనున్నది. అయితే వచ్చే నెల రాబోయే కేంద్ర బడ్జెట్.. ఐపీవోల దూకుడుకు కాస్త బ్రేకులు వేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటిదాకా సెన్సెక్స్ 6.8 శాతం, నిఫ్టీ 8.1 శాతం పుంజుకున్నాయి. ఇక 20 శాతానికిపైగా నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, 20.5 శాతం మేర స్మాల్‌క్యాప్ 100 పెరిగాయి. స్టాక్ మార్కెట్లలో కొత్తగా లిస్టింగైన కంపెనీలూ.. మదుపరులకు ఆకర్షణీయ రాబడులనే అందిస్తున్నాయి. బీఎస్ఈ ఐపీవో సూచీ ఈ ఏడాది 21.8 శాతం ఎగబాకింది. నిధుల సమీకరణలో ఆర్థిక రంగ సంస్థలదే నాల్గో వంతు (రూ.7,879 కోట్లు) వాటాగా ఉన్నది.

దేశీయ సంస్థలు, కుటుంబ వ్యాపారస్తులు, అపర కుబేరుల (హెచ్ఎన్ఐ) వద్ద కావాల్సినంత నగదు నిల్వలున్నాయి. దీంతో పబ్లిక్ ఇష్యూలకు విశేష ఆదరణ లభిస్తున్నది. దీన్నిచూసి మరిన్ని సంస్థలు ఐపీవోలకు క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది ఇలాగే సాగితే సరికొత్త రికార్డులు ఖాయం.

- చిరాగ్ నేగంది, జేఎం ఫైనాన్షియల్ ఎండీ

- చివరిసారిగా లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2019 ప్రథమార్ధంలో 8 ఐపీవోలే వచ్చాయి. వాటి విలువ రూ.5,509 కోట్లు.
- 2014 జనవరి-జూన్‌లో ఒక్క ఇనీషియల్ పబ్లిక్ ఆఫరే వచ్చింది.
- 2009 తొలి అర్ధ భాగంలో రెండు ఐపీవోలు రాగా, వీటి విలువ రూ.302 కోట్లు.
- భారతీయ స్టాక్ మార్కెట్లలోకి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా వచ్చిన నిధులు రూ.1.85 లక్షల కోట్లపైనే.
- విదేశీ మదుపరులు వెనక్కి తగ్గారేమోగానీ.. దేశీయ మదుపరులు మాత్రం పై.
- ఈ జనవరి-జూన్‌లో వచ్చిన భారీ ఐపీవో భారతీ హెక్సాకామ్. దీని విలువ రూ.4,275 కోట్లు. ఆ తర్వాత ఆధార్ హౌజింగ్ ఫైనాన్స్ (రూ.3,000 కోట్లు).
- ఈ ఏడాది వచ్చిన అతిచిన్న ఐపీవో విభోర్ స్టీల్ ట్యూబ్స్. విలువ రూ.72 కోట్లు.
- నిరుడు ప్రథమార్ధంలో నగటు డీల్ పరిమాణం రూ.896 కోట్లు. ఈసారి రూ.859 కోట్లు.

పన్ను రిబేటు పెంచాలి

- ఉద్యోగుల కోసం ట్రేడ్ యూనియన్ల డిమాండ్
- పాత పెన్షన్ పథకాన్నే అమలు చేయాలి
- కేంద్ర ఆర్థిక మంత్రితో ముందస్తు బడ్జెట్ చర్చలు



బడ్జెట్ (2024-25)

న్యూఢిల్లీ, జూన్ 24: వేతన జీవుల కోసం పన్ను రిబేటును పెంచాలని ట్రేడ్ యూనియన్లు కోరుతున్నాయి. ముందస్తు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వివిధ వాణిజ్య, వర్తక సంఘాల నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు తమ జీతం, గ్రాట్యుటీలపై ఇప్పుడున్న ఆదాయ పన్ను (ఐటీ) రిబేటు సీలింగ్ పరిమితిని భారీగా పెంచాలన్నారు. అలాగే 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, కొత్త పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దుచేసి.. పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న తదితర డిమాండ్లనూ మంత్రి వద్ద వినిపించారు. వచ్చే నెల పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ ఈ ఆర్థిక స